# బ్రతుకు చీకట్లో

"పేదోళ్ళ కథ" పోస్టరు గోడమీద అంటించేడు గోవిందు. పోస్టరు నాలుగు వైపులా సరిజేసి, వాలుగా సగం వరకూ సగ్రున చింపి, తిరిగి మళ్ళీ అంటించి సంతృప్తిగా నిచ్చెన మెట్లు దిగాడు.

"శ్యామలా టాకీస్‌లో సినిమా మారిందిరోయ్! 'ఎ' సర్టిఫికేటు. పిక్చరులో రేప్ సీన్లున్నా, లేకపోయినా పోస్టరులో గొప్పగా గుప్పించాడుసుమా"

గోవిందు అంటించిన వాల్‌పోస్టరును అయిదు నిమిషాలు ఆనందంగా నిలబడి చూసి, రోడ్డు మీద మాట్లాడుకుంటూ జంటగా సాగిపోతున్నాయి రెండు బెల్ బాటమ్ శాల్తీలు.

గోవిందు నిచ్చెన భుజానికి తగిలించుకున్నాడు. మిగిలిన పోస్టర్లు చంకలో పెట్టుకుని, జిగురు బాల్చీ చేత్తో పట్టుకుని రోడ్డు మీదకొచ్చాడు. రాత్రి ఒంటిగంట దాటింది. శీతాకాలం. చలిగాలి చెవుల్లో దూరి చర్మాన్ని కొరుకుతోంది. రెండవ ఆట నుంచి తిరిగొస్తున్న జనం పలచగా..! పరుగెడుతున్న రిక్షాలు, సైకిళ్ళు... రోడ్డు మలుపు తిరిగి మల్లన్న టీకొట్టు ముందు ఆగాడు గోవిందు. టీకొట్టు ముందు పాపం! మునిసిపాలిటీ వారి దీపం ఒకటి ముసిరే చీకటినంతా తరిమికొట్టాలని ముఖంలోకి లేని శక్తిని తెచ్చుకుని వెలుగుతోంది. నిచ్చెన దీప స్తంభానికి చేరేవేసి ఒక పోస్టరుకు జిగురు రాశాడు. ఆ దీప స్తంభానికి ఎదురుగా అనాథ శిశువుల కోసం ఏనాడో కట్టి వదిలేసిన పునాది గోడ మీద పోస్టరును అంటించాడు. 'పేదోళ్ళ కథ'ను ఆ గోడమీద అంటించినందుకు మనసులో చిన్నగా నవ్వుకున్నాడు గోవిందు. మరో రెండు పోస్టర్లు మల్లన్న టీకొట్టు లోపలకు తీసుకెళ్ళి తడికెమీద అంటించేడు. ఉసూరుమంటూ బెంచీ మీద చతికిలపడ్డాడు.

"మల్లన తాతా! స్ట్రాంగు టీ ఒకటి కలుపు. తల దిమ్ముగా ఉంది." పేంటు జేబులోని పావలా తీసి మల్లన్న టేబుల్ మీద పెట్టాడు గోవిందు.

"ఫర్వాలేదులేరా, గోవిందు, ఉంచు!" పావలా తిరిగి ఇచ్చేస్తూ మిగిలిన పాలతో టీ కలిపి గోవిందు చేతికిచ్చాడు మల్లన్న. సినిమా మారినప్పుడల్లా కొత్త పోస్టర్లు మల్లన్న కొట్లో, మరిచిపోకుండా ఒకటో, రెండో తడికె మీద అంటిస్తాడు గోవిందు. ఆ కారణంగా మల్లన్న తాత తడికే ఎప్పుడూ కొత్త పెళ్ళికూతుర్లా కళకళలాడుతుంది. గోవిందు మల్లన్నతో కాస్సేపు కష్టం సుఖం చెప్పుకుంటూ కాలక్షేపం చేయడం అలవాటు. గోవిందు టీ త్రాగి గంట క్రితం సగం కాల్చిన సిగరెట్టు ముక్క వెలిగించాడు. మల్లన్న టీకొట్టు మూసేస్తూ సామాన్లు సర్దుకుంటున్నాడు.

"ఏరా, గోవిందూ! మొన్నేదో ఉజ్జోగానికి పిలుపొత్తే వూరెళ్ళావంట ఏటయ్యింది?" మల్లన్న తాత అడిగాడు.

"పరీక్ష రాశాను, తాతా! వచ్చే నెలలో మరలా వెళ్ళాలి."

"ఏటోరా! సదూకున్నోడివై ఉండి సిన్మా హాల్లో గేటుకాడ పనిచేస్తున్నావు. పగలనక,

రాత్రనక నలిగిపోతున్నావు - నా కదేరా బాధ."

"ఈసారి ఉద్యోగం ఖాయం, తాతా..! మా అయ్యగారితో గట్టి ప్రయత్నం చేయిస్తున్నా! వస్తా మరి. ఇంకా లైను చాలా తిరగాలి."

గోవిందు ముప్పయిఏళ్ళ వయసులో మూడు ఉద్యోగాలు చేశాడు. మూడు ఉద్యోగాలు ముప్పూటలా తిండి పెట్టలేదు సరికదా, ముప్పు తిప్పలు పెట్టేయి. గోవిందు ఎస్సెస్సెల్సీ పాసయ్యాడు. ఎక్కువ మార్కులు తెచ్చుకోలేకపోయాడు. పై చదువుల ప్రసక్తే లేదు. తండ్రి రాజయ్య మిలిటరీ నుంచి పారిపోయొచ్చి సినిమాహాల్లో వాచ్‌మన్‌గా చేరిన వీరపుత్రుడు. తల్లి అక్కమ్మ అయాచితంగా ఆయాసాన్ని వూరికినే ఉబ్బసాన్ని వరాలుగా పొందిన ఉద్దండురాలు. ఒక్క చెల్లెలు వయసు ఒంటిమీదకు రాగానే, వారం వారం జంక్షనులో పనసకాయలమ్మే కుర్రాడి మీద మనసు పారేసుకుని, ఇంట్లో పోరుపెట్టి, అప్పు చేయించి మూడు ముళ్ళు వేయించుకుని ప్యాసింజరు బండెక్కేసిన పతివ్రతా శిరోమణి. గోవిందు పనివేట ప్రారంభించాడు. ఆ వేటలో వెంటనే పని దొరకలేదు గాని, మరుసటి నెలలో పెళ్ళాం మాత్రం వచ్చేసింది. ఉన్న చెల్లెలు మొగుడితో ఉడాయించటంతో ఇంట్లో వండి వార్చడానికి, చాకిరి చేయడానికి ఒక ఆడది అవసరమయింది. గోవిందుకు తండ్రి రాజయ్య ఒక గుదిబండను తగిలించాడు. గోవిందు గంగిగోవులా మెడ వంచాడు. అంతేకాదు, గోవిందు పెళ్ళి చేసుకున్న పది నెలల్లో ఒక పసికందుకు తండ్రి కూడా అయ్యాడు...

గోవిందు మొదటిసారిగా ధాన్యపు మిల్లులో చిన్నగుమస్తాగా చేరి మూడు నెలలు పనిచేశాడు. ఒకరోజు పెద్ద గుమస్తా పన్నిన వలలో గిలగిలా తన్నుకుని దుఃఖాన్ని దిగమ్రింగుతూ దొంగగా ముద్ర వేయించుకుని బయటపడ్డాడు. ఆ తరువాత ఒక ఇనుప సామాన్ల దుకాణంలో పనికి కుదిరి మరో ఇరకాటంలో పడ్డాడు. పట్టుమని పదిరోజులు పూర్తవకముందే షావుకారు పిలిచి, "పోరా, పోకిరీ నా కొడకా! నీలాంటి వాళ్ళకిక్కడ పని లేదు" అని పులిలా మీద పడితే తన తప్పేమిటో తెలియక తికమక పడి తెల్లమొహం వేశాడు. అదే కొట్లోని మరో కుర్రాడితో షావుకారు కూతురు 'రాసలీల' కళ్ళారా చూడటమే కారణమని తెలుసుకున్న తరువాత గోవిందుకి గొల్లుమని ఏడుపొచ్చినా ఏడవలేకపోయాడు. పని పోయినందుకు గోవిందు బాధపడినా రాజయ్య బేజారెత్తలేదు. కొడుకుని తీసుకెళ్ళి శ్యామలా టాకీస్ యజమాని రాజారాం ముందు నిలబెట్టాడు. 'మహాప్రభో!' నా కొడుక్కి దారి చూపించండంటూ మొర పెట్టుకున్నాడు.

రాజారాం ఆ వూళ్ళో శ్యామలా టాకీస్ ప్రొప్రయిటరే కాక, పెద్ద మనిషిగా పేరు, రాజకీయంగా ప్రజల్లో పరపతి సంపాదించుకున్నాడు. స్థానికంగా ఒక సహకార బ్యాంకు స్థాపించి దాని అధ్యక్షుడయ్యాడు. వీటిని మించి ఒక ఎమ్మెల్యేతో వియ్యమందుకుని, సదరు ఎమ్మెల్యే గారిని మంత్రి పదవి నెక్కించాలని శాయశక్తులా కృషి చేస్తున్నాడు. పదవి లేకపోయినా రాజకీయ దురంధరుడుగా పేరు తెచ్చుకున్న రాజారాం చుట్టూ రాజకీయ సలహాల కోసం చిన్నచిన్న నాయకులు తమతమ పనుల కోసం చిరుద్యోగులు, నిరుద్యోగులు ఎప్పుడూ ప్రదక్షిణాలు చేస్తూ ఉంటారు. పనికింత దక్షిణ ఖర్చవుతుందని పరోక్షంగా తెలియజేస్తే పరమ సంతోషంగా సమర్పించుకుంటారు. రాజారాం వాచ్‌మెన్ రాజయ్యమీదున్న ప్రేమతో

తన ఉదారబుద్ధిని ప్రదర్శించి గోవిందుని శ్యామలాటాకీస్ బెంచీ గేటుదగ్గర పని చేయమన్నాడు. రాజయ్య వంగి దణ్ణం పెట్టాడు. గోవిందు గుండెను బండగా మార్చుకున్నాడు. గోవిందుకు కనీసం గుమాస్తా ఉద్యోగం అయినా చేయాలని గోరంత ఆశ. ఆ ఆశ తీరే మార్గం కనిపించే వరకు ఏదో ఒకపని చేయక తప్పదనుకున్నాడు.

గోవిందు బెంచీ గేటుదగ్గర నిలబడి టిక్కెట్లు చింపుతాడు. అప్పుడప్పుడూ రిక్షా ఎక్కి మైక్‌లో చక్కగా సినిమాను పొగుడుతూ ప్రచారం చేస్తాడు. సినిమా మారినప్పుడల్లా పోస్టర్లు అంటిస్తాడు. రిక్షా ఎక్కినా, పోస్టర్లు అంటించినా బేటా డబ్బులు దొరుకుతాయి. గోవిందుకు గడ్డురోజుల్లో గోరుచుట్టు వేసింది. అది రాజయ్య కంటిచూపు దెబ్బతిని ఎక్కడకీ కదల్లేకపోవడం... గోరుచుట్టు మీద రోకటిపోటు పడింది. అది గోవిందు పెళ్ళాం రెండవసారి పురుడు పోసుకుని ఆడపిల్లను కనడం... తండ్రి రాజయ్య మూలపడటంతో కుటుంబ ఆదాయం కుంటుపడింది. గోవిందు జీతంతో ముడిపడ్డ జీవితాలు ముసలి తండ్రి, తల్లి, పెళ్ళాం, మరో రెండు పసిప్రాణాలు రోజులు భారంగా గడుస్తున్నాయి. పూటలు కటకటలాడుతున్నాయి. గోవిందు తన యజమాని రాజారాంని కలిశాడు. తండ్రి స్థితి, కుటుంబ పరిస్థితి చెప్పుకుని జీతం పెంచమని అర్థించాడు. నీకు జీతం పెంచితే మిగతా వాళ్ళు పెంచమంటారంటూ రాజారాం కసిరాడు. గోవిందు నిరాశగా వెనుతిరిగాడు...

సినిమాహాల్లో పనిచేస్తూనే అవసరాలు తీర్చే మరో మంచి ఉద్యోగం కోసం గోవిందు ప్రయత్నం చేస్తున్నాడు. గతంలో జిల్లా పరిషత్ ఆఫీసులో దరఖాస్తు పెట్టుకుంటే గుమస్తా ఉద్యోగం కోసం పిలుపొచ్చింది. ఇంటర్వ్యూ కాగితంతో రాజారాం ఇంటికెళ్ళి సహాయం చేయమన్నాడు. తన కుటుంబం కోసం ఆ ఉద్యోగం వచ్చేలా చేయమని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. రాజారాం బుర్రవూపి 'సరే చూద్దాం లే అన్నాడు కాని ఆ ఉద్యోగం గోవిందుకు రాలేదు. రాజారాం మేనల్లుడి బావమరిదిని వరించినప్పుడు గోవిందు ఆశ్చర్యపడనూ లేదు.

వారం రోజుల క్రితం రోడ్డు రవాణా సంస్థలో మరో ఉద్యోగం కోసం వ్రాతపరీక్ష రాసి వచ్చాడు గోవిందు. ఉద్యోగాలు రాష్ట్రం మొత్తం మీద ముప్పైమూడు, ఆరు పట్టణాల్లో ఒకో సెంటరులో వ్రాతపరీక్ష రాసినవాళ్ళే రెండు వేలమంది. ఇక గోవిందులాంటి అభాగ్యులు ఆశ పెట్టుకోవడానికి అవకాశం ఎక్కడిది? రాజారాం దగ్గరకెళ్ళి రికమండేషన్ విషయంలో రెండుచేతులూ జోడించాడు గోవిందు. కష్టపడి పరీక్ష బాగా రాశానని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

"గోవిందూ! నిన్ను చూస్తుంటే నాకు జాలిగానే ఉందిరా! నేనిచ్చే జీతం నీకు సరిపోవటం లేదు. మరో పనేదయినా చూపెడదామంటే ఖాళీగా ఏదీ కనపించటం లేదు. నా దగ్గర ఎప్పట్నుంచో పనిచేస్తున్నావు! పాపం, కుటుంబం కోసం నానా యాతనా పడుతున్నావ్! ఏదో అభిమానంగా ప్రయత్నం చేద్దామన్నా, ఈ రోజుల్లో గవర్నమెంటు ఉద్యోగం అంత తేలిగ్గా వస్తుందా? ఒక వెయ్యి రూపాయలు ఖర్చు పెడితే పని జరగొచ్చు! నువ్వా ఖర్చుకు తట్టుకోగలవా! తట్టుకోగలిగితే మాత్రం ఉద్యోగం ఖాయం!" రాజారాం అందంగా ఆత్మీయత ఒలికించాడు.

గోవిందు తల్లి కాళ్ళ కడియాలు, భార్య చెవి పోగులు తెగనమ్మాడు. భార్య పుట్టింటి కెళ్ళి కొంతపైకం పుట్టించాడు. అయిదు వందలు పోగు చేశాడు. రాజారాం చేతుల్లో పెట్టి

'మీదే భారమన్నాడు. మిగతా డబ్బు జీతంలోంచి కొద్దికొద్దిగా జమ కడతానన్నాడు. రాజారాం ఒప్పుకుని హామీ ఇచ్చాడు. గోవిందు గుండెనిండా పూపిరి పీల్చుకున్నాడు.

"ఒరేయ్, గోవిందూ! నత్తనడక నడుత్తున్నావ్! ఎప్పటి కవుద్దిరా నీ సూర్యాపేట లైనంతా!" తనతోబాటు సినిమాహాల్లో పోస్టర్లు అంటించే పద్దయ్య సైకిలు మీద పోతూ పలకరించాడు. గోవిందు అదిరిపడి, ఆలోచనల్ని వదిలించుకుంటూ త్వరత్వరగా అడుగులు వేయసాగాడు.

గోవిందు మేనకా లాడ్జి గోడమీదకు నిచ్చెన చేరవేశాడు. గోడపక్క మురిక్కాలువ గోలచేస్తూ పరిగెడుతూంది. కాలవలో జలకాలాడుతూన్న వరాహజంట గోవిందుని చూసి 'ఎవరూ?'అన్నట్టు మోరలెత్తాయి. ఒక్కసారి ఒయ్యారంగా ఒళ్ళు విదిలించుకున్నాయి. ఆ విదిలించుకోవడంతో తమ ఒంటిమీద జాలువారుతున్న సుగంధ జలాన్ని గోవిందు ముఖంపై పన్నీటిజల్లులా చిలకరించాయి. అప్పటివరకూ గుంపులు గుంపులుగా గుసగుస లాడుకుంటున్న దోమల పరివారం 'గంయ్' మని లేచి గోవిందు కాళ్ళను ప్రేమతో పెనవేసుకున్నాయి. గోవిందు ముక్కుమూసుకుని ముఖం మీది పన్నీటిని గుడ్డతో తడుచుకున్నాడు. కాళ్ళను పెనవేసుకున్న ప్రేమపాశాల్ని చేతులతో విదిలించుకున్నాడు. ఫోర్‌షీట్స్ వాల్‌పోస్టరు బయటకి తీశాడు. ఒక్కొక్కషీట్‌కు జిగురు రాసి గోడమీద అంటించసాగాడు...

గోవిందుకు మనసులో కొండంత ధైర్యంగా ఉంది. యజమాని రాజారాం ప్రయత్నం వల్ల ఈసారి తప్పకుండా గవర్నమెంటు ఉద్యోగం దొరుకుతుందనే నమ్మకం పెరిగింది. "అయిదు వందలు చేతికిచ్చాడు. ఆ పైన జీతంతో జమ కడతానన్నాడు. ఆయన తలుచుకుంటే జరగని పనేముంది! ఎంతమందికి ఉద్యోగాలిప్పించలేదాయన! ఉద్యోగం రాగానే ఈ మురికి పనికి చేతులు కడుక్కుంటాడు. కట్టుకున్న పెళ్ళాన్ని, పిల్లల్ని, కన్న తల్లితండ్రుల్ని కొంతయినా సుఖపెడతాడు." ఆలోచనలు అంచెలంచెలుగా ఆశల శిఖరాల్ని చేరుకుంటున్నాయి. చీకట్లు విడిపోయి కొత్త వెలుగులు ఏవో కళ్ళకు కనబడుతున్నాయి. ఆనందంగా మూడు షీట్స్ అంటించాడు గోవిందు. నాలుగవ షీట్‌కు జిగురు రాసి నిచ్చెనెక్కి గోడకు అంటిస్తున్నాడు.

మురిక్కాలవలో జంటగా జలకాలాడుతున్న మగవరాహం సతీమణి పిలుస్తున్నా లెక్కచేయక సరదాగా లేచి గోవిందు నిచ్చెనకొమ్ముును పర్వతంలా ఢీ కొని పరుగెత్తి ముందుకు పోతే, మరుక్షణంలో నేలతల్లి ఒడిలో నిచ్చెన బెణికి, ఒరిగి గోవిందు ఎత్తునుంచి దభాలున కూలి "అమ్మా!" అన్నాడు. గోడమీద పోస్టరు గుండె, విలవిల లాడుతూ 'అయ్యో పాపం' అనుకుంటూ రెప రెప లాడింది...

❀ ❀ ❀ ❀ ❀ ❀

ఆ పట్టణానికి ఎడంగా ఉన్న కూలిపేటలో గుడిసెకంటే పెద్దది, గొడ్లపాక కంటే చిన్నది ఆ ఇల్లు. ఆ ఇంటిని రెండు భాగాలు చేస్తూ నిలబడి ఉంది నిడివైన తడికె. తడికె నెత్తిమీద ఇంటి చూరులో పిచ్చుక పిల్లలు కొన్ని తల్లి తెచ్చిన ఆహారాన్ని కిచకిచమంటూ తింటున్నాయి. ఆ ఇంటిలోపల అయిదు జీవాలు మాత్రం ఆకలితో నకనకలాడుతున్నాయి. నైరాశ్యాన్ని నెమరేస్తున్నాయి. తడికె వేరు చేసిన ఒక గదిలో గోవిందు చాపమీద పడుకుని, చూరులోని పిచ్చుక పిల్లల్ని చూస్తూ పిచ్చిగా ఆలోచిస్తున్నాడు. అదే గదిలో నులక మంచంలో గుక్కపెట్టి ఏడుస్తున్న పక్కలో పిల్లదాన్ని

సముదాయించే ప్రయత్నంలో రొమ్మును ఆ పిల్ల నోటికందించి, విఫలమై విసుగెత్తి కూతుర్ని మొగుడి చేతుల్లో పెట్టి సణుక్కుంటూ పొయ్యిముందు కూలబడింది. పొయ్యి మీద ఎసరు లాగే ఆమె మనసూ తెలియని కోపంతో తెగ మరుగుతోంది. రెండోగదిలో రాజయ్య దుప్పటి ముసుగేసుకుని, ఒడిలో కునుకు తీస్తున్న మనవణ్ణి జోకొడుతూ, మిగిలిన చుట్టముక్కను తగలెట్టడానికి నిప్పు కణికను కోడలు పిల్ల కోప్పడకుండా అందిస్తుందా లేదా అనే సందేహంలో ఉన్నాడు. ఒకపక్క ముసలి తల్లి అక్కమ్మ మూలుగుతూ, అప్పుడే అప్పుగా తెచ్చిన నూకల్ని చేటలో పోసి చెరుగుతూంది. చేటలో నూకలు జావగా మారాలి. నలుగురి కడుపుల్లో చేరి జ్వాలను చల్లార్చాలి. అప్పుడే సాయంత్రం అయిదు గంటల సైరను కూసింది ఆకలి గొంతుతో...!

గోవిందు ప్రభుత్వ ఆసుపత్రిలో నెలరోజుల పైగా పడకను అంటిపెట్టుకు పోయాడు. ఇంటికొచ్చిన తరువాత డాక్టర్లు విశ్రాంతి అవసరమన్నారని విరాగిలా కూర్చుండిపోయాడు. పొయ్యి పిల్లుల్ని పిలుస్తుంది. కుండలు కన్నీళ్లు నింపుకుంటున్నాయి. సత్తుకంచాలు బిత్తరపోయి చూస్తున్నాయి. గోవిందు రోగిష్ఠి తల్లి నూనెమిల్లు ఆవరణలో సెనగకాయలు ఒలిచి వచ్చిన కూలి డబ్బులతో ఒక్కోపూట గడుపుతోంది. అత్తగారి ఆయాసం ఎక్కువైతే కోడలు పనిలోకి వెళ్ళి కడుపుల్ని నింపుతోంది...

"గోవిందూ! వోరి గోవిందూ! ఎక్కడున్నావురా!" హాల్లో మెయిన్‌గేటు దగ్గర నిలబడే నారాయణ ఒగురుస్తూ ఇంట్లోకొచ్చాడు. గోవిందు ఉలిక్కిపడి కూర్చున్నాడు. గోవిందు తల్లి, తండ్రి, పెళ్ళాం కంగారుపడుతూ సంగతేమిటన్నట్టు నారాయణ చుట్టూ మూగారు.

"మేనేజరుబాబు నిన్ను ఉన్నపళంగా వెంటబెట్టుకు రమ్మన్నార్రా!"

"ఏదయినా పని తగిలిందా! ఎందుకో చెప్పవేట్రా!!" రాజయ్య దగ్గుతూ అడిగాడు.

"ఏమో? నాకు తెల్దు!" నారాయణ నిక్కచ్చిగా చెప్పాడు. గోవిందు చొక్కా తొడుక్కుని బయలుదేరాడు. నారాయణ సైకిలు తొక్కుతుంటే, గోవిందు వెనకాల సీటు మీద కూర్చున్నాడు.

"మేనేజరుగారెందుకు కబురెట్టినట్టు? రాజారాం బాబు వూర్లో లేరని తెలిసింది. ఒకవేళ, పనిలోకి ఎప్పుడొస్తావని అడగటానికా? రానవసరం లేదని చెప్పటానికా? రేపో, ఎల్లుండో నీరసం తగ్గిన తరువాత తనే వెళ్లి కనిపించాలనుకున్నాడు. ఏం జరుగుతుందో!"

గోవిందు, నారాయణ శ్యామలా టాకీస్ ముందు సైకిలు దిగారు. 'పేదోళ్ళ కథ' మొదటిఆట అప్పుడే మొదలుపెట్టారు. థియేటరు ముందు టిక్కెట్లకోసం కొందరింకా కుమ్ములాడుతూనే ఉన్నారు. గేటు ముందు హవుస్‌ఫుల్ బోర్డు తగిలించగానే జనం నిరాశగా వెనక్కి తిరిగారు. గోవిందు జనాన్ని తప్పించుకుంటూ మేనేజరు గదివైపు నడిచాడు.

"గోవిందూ! రావోయ్! రాజారాంగారు వచ్చీ రాగానే నీకోసమే కబురు పెట్టమన్నారు. వెళ్ళు! నీ జాతకం మారిందిలే! పైన బాల్కనీ హాలు పక్కగదిలో కూర్చున్నారాయన!" మేనేజరు కేష్‌బాక్సు ముందు కూర్చొని డి.సి.ఆర్. షీట్ చూసుకుంటున్నాడు. గోవిందు మెట్లెక్కి నెమ్మదిగా పైకి వెళ్ళాడు. మనసంతా గందరగోళంగా ఉంది. రాజారాం బాల్కనీ హాలు పక్కగదిలో ఈజీ ఛైర్‌లో కూర్చొని ఆ రోజు టపాలోని ఉత్తరాలను పరీక్షగా చదువుతున్నాడు.

"నమస్కారం, బాబూ", గోవిందు గుమ్మం దగ్గరే నిలబడ్డాడు.

"గోవిందూ! వచ్చావా! నువ్వు అదృష్టవంతుడివిరా! మన ప్రయత్నం ఫలించింది. రోడ్డురవాణా

సంస్థలో ఎల్.డి. క్లార్క్‌గా నీకు ఉద్యోగం వచ్చింది. ఇదిగో నువ్వు సెలక్టయినట్టు లెటరు! తీసుకో!" గోవిందు గుండె గుబగుబలాడుతుండగా గబగబా వెళ్ళి లెటరు అందుకున్నాడు. ఆత్రతగా చదివి అందులోని సారాంశం అర్థం చేసుకున్నాడు. అతని ఉత్తరాలన్నీ సినిమాహాలు ఎడ్రసుకే వస్తాయి.

"ఏమైతేనేం! నేను గట్టిగా పట్టుబట్టినందుకు, సెలక్షన్ కమిటీ వాళ్ళు మాట దక్కించారు. నీకు ఉద్యోగం వచ్చింది. నాకూ చాలా సంతోషంగా ఉంది. వెళ్ళు! మీ నాన్నతో చెప్పు. ఇక మీ కష్టాలన్నీ గట్టెక్కినట్టే! మరొకటి. నువ్వు నాకు అయిదువందలు చేతికిచ్చావ్! గుర్తుందా! మిగతా అయిదువందలు... నిన్నేమీ అడగదల్చుకో లేదులే. ఏదో నీకు ఉద్యోగం ఇప్పించిన తృప్తి నాకూ ఉండాలిగా!"

"అన్యాయం, బాబూ! నే ఇచ్చిన అయిదువందలు తిరిగి నాకిచ్చేయండి. ఈ ఉద్యోగం తమరు ఇప్పించింది కాదు. తమరి ప్రయత్నం ఇందులో ఏమీ లేదు. ఇంతకాలానికి ప్రభుత్వం కనికరించి నన్ను నా కాళ్ళ మీద నిలబడేట్టు చేసింది. నాకో ఉపాధి కల్పించింది...

కానీ, బాబూ! నా కాళ్ళ మీద నేను నిలబడటానికేమో, నా కుడికాలు ఎముక విరిగింది... నన్ను కుంటివాణ్ణి చేసి మా కడుపుల కింత తిండి దొరికేలా చేసింది. మరో అదృష్టం ఏమిటంటే, బాబూ! మొన్న మొన్నటివరకూ నాకు, నా వాళ్ళకు రెండుపూటలా తిండి లేకపోయినా, నేను మాత్రం రెండు కాళ్ళతో నిటారుగా నడిచాను. ఇప్పుడు నాకొచ్చిన ఉద్యోగం వల్ల రెండు పూటలూ మా కడుపులు నిండతాయోమో కాని, జీవితంలోనేనిక ఎప్పుడూ నిటారుగా నడలేను, బాబూ! ఇదిగో ఈ క్రరసాయంతో ఎక్కడికైనా కదిలివెళ్ళాలి. కాలు విరిగినందుకు నాకు బాధలేదు, బాబూ! కాలు విరిగితేనే గాని జీవితంలో నా కాళ్ళమీద ఆర్థికంగా నిలబడే శక్తి కలగకపోవడం నా అసలైన అదృష్టం! మీ సినిమా హాలులో పనిచేసి కుంటివాడి నవకపోతే నాకీ ఉద్యోగం వచ్చేది కాదేమో! ఆరోజు నేను కుంటివాడినయినప్పుడు ఏవో కారణాలు ఎత్తి చూపించి, నీ అజాగ్రత్త కారణమని నొక్కి చెప్పి, ఏభయి రూపాయలు చేతిలో పెట్టించారు. పోనీలెండి. నాకు మీరేమీ ఇవ్వక్కర్లేదు గాని, ఆ ఉద్యోగం కోసం నేనిచ్చిన అయిదువందలు నాకిచ్చేయండి, బాబూ! నా దరిద్రాన్ని ఒక దరికి చేర్చిన పుణ్యం పూర్తిగా కట్టుకోండి, బాబూ!"

గోవిందు మనసులో అనుకున్నదంతా గట్టిగా అరవాలనుకున్నాడు. అరచి గోల చేయాలనుకున్నాడు. గోల చేసి ఘొల్లుమని ఏడవాలనుకున్నాడు. కాని గొంతు విప్పి "వస్తాను, బాబూ! మీరు చేసిన సహాయం మా నాన్నతో చెప్పుకుంటాను... నా గుండెలో పదిలంగా దాచుకుంటాను." అంటూ సొట్టకాలుతో బయటికి నడిచాడు.

నిచ్చెన ఒరిగి కాలు విరిగిన గోవిందు హాస్పిటల్ నుంచే ఇంటర్వ్యూకెళ్ళడం, వికలాంగునిగా గుర్తించబడటం, ఉద్యోగం తన ప్రయత్నం లేకుండానే రావడం గుర్తుకొచ్చి గంభీరంగా నవ్వుకున్నాడు రాజారాం.

హాలు బయటకొచ్చిన గోవిందు మలుపు తిరిగి, ఇంటికి పోయే కంకర రోడ్డుమీద ఒక్క క్షణం నిలబడ్డాడు. చుట్టూ చీకటి వికటంగా నవ్వుతూంది. అయినా బ్రతుకు చీకట్లో గుమస్తా జీవితం గోరంత దీపంలా కళ్ళ ముందర కనబడుతుంటే కొండంత భవిష్యత్తును తలచుకుంటు(తూ) నడుస్తున్నాడు.

శ్యామలాటాకీస్‌లో 'పేదోళ్ళ కథ' చూస్తున్న ప్రేక్షక మహాశయులకి "విశ్రాంతి" దొరికింది.

(ఆంధ్రప్రభ, 7.10.1981
మధ్యపేజీ కథ బాపూబొమ్మతో)

❀ ❀ ❀ ❀ ❀ ❀